

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థినులకు కాంస్య పతకాలు


విద్యార్థినులను అభినందిస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు

ప్రజాశక్తి - అంబాజీపేట

గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ విద్యార్థినులు మట్టపర్తి గ్రీష్మ శ్రీ, ఇల్ల మనోజ్, నాగ దీప్తి, దంగేటి విద్యా సాయిశ్రీ ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించారని హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీహరి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. విద్యార్థినులను, పీడీ శేష వెంకట సూర్య మధును సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యుడు విత్తనాల భవాని ఇంద్రశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ తొత్తరమూడి గోవిందరావు, మాజీ సర్పంచ్ మట్టపర్తి చంద్రశేఖర్, గ్రామపెద్దలు ఎంఎం.శెట్టి, కృష్ణ మహేష్, రాయుడు షణ్ముఖ్,ఉపాధ్యాయులు అభినందించారు.

కొబ్బరి అ'ధర'హో

- రికార్డు స్థాయిలో రూ.20 వేలు
- నెల రోజుల్లోనే రెట్టింపు ధర
- ఆచితూచి అమ్ముతున్న రైతులు
- రోజుకు 70 లారీల వరకూ ఎగుమతి



ప్రజాశక్తి-రాజోలు

కోనసీమ కొబ్బరికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. కొబ్బరికాయల ధర భారీగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ధర రెట్టింపు అయ్యింది. మార్కెట్లో వెయ్యి కొబ్బరికాయల ధర రూ.9 వేల నుంచి రూ.20 వేలకు చేరింది దసరా, దీపావళి ముందున్నందున అప్పటికి ఈ ధర రూ.20 వేలకు చేరొచ్చని రైతులు, వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. కొత్తకొబ్బరి, పచ్చికొబ్బరి కాయలు, కురిడీ కొబ్బరికాయల ధరలు కూడా ఆశాజనకంగానే ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ నుంచి హైదరాబాద్‌కు కొబ్బరికాయల రవాణాకు లారీకి కిరాయి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ ఉంటుంది. అంటే ఒక్కో కొబ్బరి కాయ రవాణాకు రూ.1-1.50 వరకు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. పచ్చి కొబ్బరికాయలు తెలుగు రాష్ట్రాలతో పాటు ముంబయి, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. వీటితో పాటు కురిడీ కొబ్బరికాయలు ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌తో పాటు మరి కొన్ని రాష్ట్రాల వ్యాపారులు సైతం కొబ్బరికాయలు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. దీనిని బట్టి కోనసీమ కొబ్బరికాయలకు ఏర్పడిన డిమాండ్ అర్థమవుతుంది.

అయిదేళ్లు అనేక ఇబ్బందులు

ప్రస్తుతం ధర భారీగా పెరిగి, కొబ్బరి రైతులు సంతోషంగా ఉన్నప్పటికీ, గత అయిదేళ్లలో అనేకసార్లు ఇబ్బందులు పడ్డారు. దిగుబడులు తగ్గడంతో పాటు ధరల పతనం కోనసీమ కొబ్బరి రైతుల్ని కుంగదీసింది. ఆ సమయంలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ కొబ్బరి నుంచి సైతం గట్టి పోటీ ఎదురయ్యేది. దీంతో పోటీని తట్టుకోలేక కోనసీమ రైతులు, వ్యాపారులు ఒకానొక సమయంలో చతికిలపడిపోయారు. ప్రస్తుతం పరిస్థితులు మారి, భారీగా ధర పెరిగింది. దీంతో కోనసీమ కొబ్బరికి మళ్లీ మంచి రోజులు వచ్చాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజుల్లో రెట్టింపు ధర

కేరళలో ఓనం పండుగ.. తమిళనాడులో కొబ్బరికాయ అందుబాటులో లేకపోవడం.. కోనసీమ కొబ్బరి రైతులకు పండగ వచ్చింది. కొబ్బరికాయ ధర రికార్డ్ స్థాయిలో పెరగడంతో వారికి దసరా... దీపావళి పండగ ముందే వచ్చింది. కొబ్బరి వెయ్యి కాయల ధర సైజును బట్టి రూ.17,500 నుంచి రూ.18 వేల వరకు పలుకుతోంది. అంబాజీపేట కొబ్బరి మార్కెట్ చరిత్రలో ఇది ఆల్ టైమ్ కొబ్బరి ధరల రికార్డు. ధర ఈ స్థాయిలో పెరగడంతో ఉమ్మడి గోదావరి జిల్లాలోని కొబ్బరి రైతులకు ముందే దసరా, దీపావళి పండగ వచ్చినట్టయింది. వరుస పండగల నేపథ్యంలో కొబ్బరి ధరలు అనూహ్యంగా పెరిగాయి. నెల రోజుల క్రితం వెయ్యి కొబ్బరికాయల ధర రూ.8,500 మాత్రమే ఉండేది. తర్వాత నెమ్మదిగా పెరుగుతూ ఆగస్టు నెలాఖరు నాటికి రూ.10,500కు చేరింది. వినాయక చవితి సమయానికి రూ.11,500 నుంచి రూ.12 వేల వరకు ధర రావడంతో రైతులు చాలా వరకు కోలుకున్నారు. కానీ గత వారం రోజుల నుంచి ధర రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది, తమిళనాడు, కర్ణాటకల్లో కొబ్బరి దిగుబడులు తక్కువగా ఉన్నాయి. కేరళలో ఓనం పండగ కారణంగా స్థానికంగా కొబ్బరి వినియోగం ఎక్కువగా ఉంది. దీనితో ఆ రాష్ట్రం నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు మందగించాయి. ఈ కారణంగా ఉత్తరాది మార్కెట్ అవసరాలను ఉమ్మడి గోదావరి జిల్లాల కొబ్బరి తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల గతంలో ఎన్నడూ లేనంత ధర రావడం విశేషం.

ఏడేళ్ల తర్వాత రికార్డు ధర..!

ఏడేళ్ల తర్వాత కొబ్బరికాయకు రికార్డు స్థాయి ధర వచ్చింది. 2017లో కొబ్బరికాయకు జాతీయ మార్కెట్లో రూ.17 వేల ధర రాగా ఈసారి అంతకుమించి ధర పలుకుతుండటం విశేషం. మార్కెట్లో ఈ స్థాయి ధర రావడం అరుదైన విషయమని కొబ్బరి రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరికాయతో పాటు మిగిలిన కొబ్బరి ఉత్పత్తుల ధరలు సైతం పెరిగాయి. ప్రస్తుతం పాత కురిడీ కాయ గండేరా వేయింటికి రూ.14 వేలు, గటగట రూ.17,500, కురిడీ కొత్త కాయ గండేరా రూ.13 వేలు, గటగట రూ.15,500 పలుకుతోంది.

ప్రయివేటు ఆసుపత్రుల్లో సౌకర్యాల లేమి

- అవస్థలు పడుతున్న రోగులు
- రూ.వేలు ఫీజులు వసూలు
- గంటల తరబడి పేషెంట్లు నిరీక్షణ
- ప్రయివేటు ఆసుపత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి సిపిఎం డిమాండ్


ఒక ప్రయివేటు ఆసుపత్రిలో సిపిఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం

ప్రయివేటు ఆసుపత్రుల్లో సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. వందల మంది పేషెంట్లు వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యాలు పేషెంట్ల దగ్గర ఫీజులు, ఒపీలు రూపంలో, రూమ్ చార్జీలు, సర్జరీలు పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నాయని అన్నారు. తప్పితే పేషెంట్లకు ఎక్కడ సరైనటువంటి సౌకర్యాలు కల్పిస్తున్న పరిస్థితులు లేవన్నారు. ఇటీవల కాలంలో ఎవిఎస్ ఆసుపత్రి నందు ఇదేవిధంగా రూ.వేలువసూలు చేశారని ఆరోపణలు కూడా వచ్చాయన్నారు. వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీనిధి ఉన్నత ఆసుపత్రిలో వందలాది మంది పేషెంట్లు డాక్టర్ ఓపి కోసం వెయిటింగ్ చేస్తున్నటువంటి పరిస్థితులు ఉన్నాయని సిపిఎం బృందం ప్రత్యక్షంగా పరిశీలన చేసిందని తెలిపారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలైనా ఉన్న చోట ఫ్యాన్లు కూడా లేక పేషెంట్లు చెట్ల క్రింద వెయిటింగ్ చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కారెం వెంకటేశ్వరరావు ఆరోపించారు. పేషెంట్లను పట్టించుకునే పరిస్థితులు లేవన్నారు. వాస్తవంగా ప్రయివేటు ఆసుపత్రి నిర్వహణలో సరిపడా పేషెంట్లు వెయిట్ చేయడానికి, ఓపి చూడ్డానికి, సరిపడా బిల్డింగ్ సౌకర్యాలు కూడా ఉండాలని సరిపడా డాక్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కానీ ఇవేమీ శ్రీనిధి ఆసుపత్రిలో లేకుండానే కొంత మంది డాక్టర్స్ గ్రూపు ఏర్పాటు హరణకి గ్యాస్ట్రాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ ఫిజీషియన్, ఇఎన్టి రకరకాల డాక్టర్లు సేవల పేరుతో పేషెంట్లు నుంచి రూ.వేలు వసూలు చేస్తున్నారే తప్ప కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ఒపి సుమారు రూ.500 రూపాయలు వసూలు చేస్తూ కేవలం వారం పది రోజులు మాత్రమే దానికి టైం పీరియడ్ పెట్టారని ఇది చాలా అన్యాయమని ఓపి కాలపరిమితి నెల రోజులకి అన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లోను ఉండేలా ప్రభుత్వం డిఎంఅండ్ హెచ్ఓ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందులు ల్యాబ్ టెస్టులు పేరుతో కొన్ని రూ.లక్ష లు వసూలు చేస్తున్నారని వాపోయారు. రోజురోజుకీ జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రుల ఆగడాలు పెరుగుతున్నాయని వీటిని నియంత్రించేటువంటి ప్రభుత్వం డి ఎం అండ్ హెచ్ ఒ పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఇటీవల శ్రీహరి ఆసుపత్రిలో క పేషెంట్ మరణం కూడా సంభవించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఇప్పటికైనా అన్ని పనులను ఉన్న ఆసుపత్రులకు మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు ఆసుపత్రుల పట్ల ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎస్.సూర్యనారాయణ, పొలమూరి శ్రీనివాస్, తాడి శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.

'అమలాపురం' కమిషనర్‌గా రాజు బాధ్యతల స్వీకరణ


మున్సిపల్ కమిషనర్ రాజుకు పుష్పగుచ్ఛం అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మునిసిపల్ కమిషనర్‌గా రాజు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ ఆఫీస్ నందు ఈ సందర్భంగా పలువురు ఆయనను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ జిల్లా అధ్యక్షులు ఏడిద దొరబాబు, అమలాపురం అధ్యక్షులు బి.బాలకృష్ణ, నాగేశ్వరావు, కన్నబాబు, కృష్ణమోహన్, గోపాలకృష్ణ, బాబ్జి, ఆర్కిటెక్ట్ శివ తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో రైతులు సమస్యల పరిష్కారం, సాగులో సాంకేతిక పద్ధతుల వినియోగం తదితర అంశాలపై పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధి.కారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

రామచంద్రపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందనీ, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ ఎన్‌డిఎ కూటమి ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసనశెట్టి సుభాష్ అన్నారు. వెల్ల గ్రామంలోనిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమం లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని అయినవిల్లి మండలంలోని నల్లచెరువు మరియు నేదునూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖల ద్వారా రైతులకు ప్రభుత్వ అందిస్తున్న పథకాలు గురించి వివరించారు ఈ సందర్భంగా రైతుల తమ సమస్యలను అధికారులకు తెలియజేశారు. చేశామన్నారు. ఈ రకానికి తెగుల్లు ఎక్కువగా ఆశించామన్నారు. రైతులు ఎక్కువగా నత్రజని ఎరువులు వాడటం వలన ఈ తెగులు అధికంగా ఉందని, అంకురం ఏర్పడే దశలో 15, 20 కిలోల పొటాస్ ఎరువును వేసుకోవాలని, ఈ తెగులు నివారణకు ఎకరానికి ఎకరానికి అలాంటో మిషన్ 100గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 450గ్రాములు పిచికారీ చెయ్యాలని తెగులు ఉధతి ఎక్కువగా ఉంటే 7నుంచి 10 రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేసుకోవాలని, దీనిలో ఏ విధమైన పురుగు,ెగులు మందులు కలపరాదని వ్యవసాయ అధికారులు సూచించారు మండల వ్యవసాయ అధికారి వై శోభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎఒ జిల్లా వ్యవసాయ అధికారి ఒ.బోసు బాబు, సహాయ సంచాలకులు ఎం.షంషి, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అల్లవరం:సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం గూడాల గ్రామంలో సర్పంచ్ దాకారపు చిరంజీవి రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్‌వివి.సత్య నారాయణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని అశ్విని సత్య, ఉప సర్పంచ్ పోలిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వరి పంటపై ఆశించు వివిధ రకాల తెగుళ్ళపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె.వి.ఎన్ రమేష్ కుమార్ అన్నారు. కపిలేశ్వరపురం మండలం పరిధి టేకి ,వాకతిప్ప గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు .

ముమ్మిడివరం: రైతులు సాగులో సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అనాతవరం సర్పంచ్ మిమ్మితి చిరంజీవి అన్నారు. అనాతవరం పంచాయతీ పరిధిలో వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

ఉప్పలగుప్తం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆనంద రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఎంఎ.షంషీ మండల వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: వివిధ రకాల తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పి.గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్జెవి.రామ్మోహనరావు అన్నారు. పసుపల్లి, ఇరుసుమండ రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ వాటి అనుబంధ శాఖల ఆణ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.



వెల్లలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్


నేదునూరులో రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తాం

ఎంఎల్‌ఎ ఆనందరావు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆనందరావు, పాల్గొన్న ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గతంలో నిర్వహించినట్టుగానే తిరిగి కూటమి ప్రభుత్వంలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు.గొల్లవిల్లి జెడ్పి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీ ఎంపికల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎం ఎల్‌ఎ ఆనందరావు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు సమైక్యతకు దోహదపడతాయన్నారు. అలాగే ఎస్.యానాం బీచ్ లో జాతీయ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తానని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయని విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులను ఎంఎల్‌ఎ ఆనంద రావు, ఎంఎల్‌సి వెంకటేశ్వరరావులు దుశ్శా లువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమ ంలో స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జెడ్‌పిటిసి, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొమరాజులంకలో 'ఇది మంచి ప్రభుత్వం'


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి-రావులపాలెం


మండల పరిధి కొమరాజులంకలో మంగళవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలుసుకున్న కూటమి ప్రభుత్వం రూ.1675 కోట్ల బకాయిలను విడుదల చేసి రైతు ప్రభుత్వ మని నిరూపించుకుందన్నారు. డిఎస్‌సి అభ్యర్థులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. రూ.వెయ్యి పెంచి పింఛన్లు అందిస్తున్నామని, మొదటి తారీఖునే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని తెలిపారు.వంద రోజుల పాలనలో అభివృద్ధికి బాటలు వేశామన్నారు.అనంతరం గ్రామంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, తహశీల్దార్ బి.ముక్తేశ్వరరావు, ఎంపిడిఒ సాయిబాబు, ఎఒ జి.రాజేంద్రప్రసాద్, ఎపిఒ కవిత, హౌసింగ్ ఎఇ జేజిబాబు, కార్యదర్శి వి.సబిత, ఎన్‌డిఎ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

ప్రజాశక్తి-అమలాపురం (అల్లవరం)

అ బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం నందు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీల ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గత ఏడాదిలో గ్రామంలో చేసిన పనులను గ్రామసభ ద్వారా ప్రజలకు వివరించారు. ఉపాధి హామీ చట్టంలో జాబు కార్డు పొందిన ప్రతికూలి 100 రోజు పని దినాలను ఉపయోగించుకోవడంతోపాటు పనిచేసేటప్పుడు హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి ఇచ్చేటటువంటి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెట్లు దగ్గర ఉంచుకుని ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉపయోగిం చుకోవాలని గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం జెఇ అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ బొంతు శ్యాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దర్గా శ్రీను, పాలకవర్గ సభ్యులు తదిరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీల్లో ప్రజాప్రతినిధుల, అధికారలు పాల్గొని ప్రసంగించారు. పరిశుభ్రత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలను కోరారు.

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కొనసాగుతున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు రామచంద్రపురం మండలం వెల్ల గ్రామపంచాయతీలో మంగళవారం నిర్వహించారు. డివిజనల్ లెవెల్ పంచాయతీ అధికారి శాంతి కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామచంద్రపురం - వెల్ల మెయిన్ రోడ్ లో ఉన్న చెత్తను శుభ్రం చేయించడం, బ్లీచింగ్ చెల్లించడం, వీధులను పరిశుభ్రంగా ఉంచటం పై గ్రామములో అవగాహనా రాలి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత వల్ల వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు అని ప్రస్తుతం వర్షాకాలంలో విజంభిస్తున్న టైఫాయిడ్ మలేరియా, డెంగీ వంటి వ్యాధులు దోమలు ఈగల వల్ల విజంభిస్తాయని వాటిని అరికట్టేందుకు చెత్తాచెదారం తొలగించి నీరు నిలవలేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాయుడు ఈశ్వర రావు, సచివాలయం సిబ్బంది , పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మనమంతా పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నిచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఎస్ఎమ్‌సి ఛైర్మన్ జాలాది సహదేవుడు అన్నారు. మంగళవారం బెజవాడ గోపాలరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఎస్ఎమ్ సి ఛైర్మన్ సహదేవుడు, ఎన్‌డియే నాయకులు కృష్ణంరాజు, గోపిశెట్టి సత్తిబాబు, బండారు శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పులగం ప్రసన్నకుమార్, ఎన్‌డియే నాయకులు సఖినాల గణపతి, వీటి రాజు, చిలకమర్తి యెష్ణ, జాలాది జయప్రకాష్, జాలాది తులసికుమార్, కార్యదర్శి కష్ణ మణి,ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎంఎల్‌ఎలను బర్తరఫ్ చేయాలి


ఎదుర్లంకలో జెఎసి మాలమహానాడు నాయకుల ధర్నా

ప్రజాశక్తి-ఐ.పోలవరం

అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణంరాజును, రంగరాయ మెడికల్ కళాశాల దళిత డాక్టర్ పై దుర్భాషలాడిన కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ ను తక్షణం బర్తరఫ్ చేయాలని ఐ.పోలవరం మాల మహానాడు జెఎసి డిమాండ్ చేసింది. మంగళవారం ఎదుర్లంక వారధి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఐ.పోలవరం మాల మహానాడు జె.ఎ.సి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన పివి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఉమామహేశ్వరావు పై దాడి చేసి అవమానించిన రూరల్ ఎంఎల్ పంతం నానాజీని, అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఎంఎల్‌ఎ ను పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేవు శ్రీనివాసరావు, దుక్కిపాటి సత్య నారాయణ, వడ్డి గౌతమ్, మట్టా గగన వీరుడు, మోర్త చిన్నా, ములపర్తి శ్రీను బాబు, పచ్చిమాల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ రఘురామను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-మామిడికుదురు

అంబేద్కర్ ఫ్లెక్సీ చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును అరెస్టు చేయాలంటూ జెఎసి నాయకులు మంగళవారం నిరసనకు దిగారు. గెద్దాడ లో ఆందోళన చేసి ఆర్‌ఆర్‌ఆర్‌ను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్ ఆర్ ఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉద్దేశ్యపూర్వకంగా అంబేద్కర్ ఫ్లెక్సీని చింపేసి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నించిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల మురళీకష్ణ, చింతా రాజబాబు, కొల్లాబత్తుల సతీష్, చింతా మధు, చింతా దుర్గాప్రసాద్, గుబ్బల నాగరాజు, ఎంపిటిసి సభ్యుడు జవ్వాది సత్తిబాబు, విప్పర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: అంబేద్కర్ ఫ్లెక్సీని చింపి ఆయనను అవమానించిన ఉండి టిడిపి ఎంఎల్‌ఎ రఘురామకష్ణంరాజును ఎంఎల్‌ఎ పదవి నుంచి సస్పెండ్ చేయాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు ఉప్పలగుప్తం అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత నాయకులు మాట్లాడారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఆలమూరు, కడియం

మండలంలోని జొన్నాడ 216(ఎ) జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చొప్పెల్ల చెందిన వానపల్లి రాజేష్(30), కడియం మండలంలోని దుళ్ల చెందిన వేగిరాజు సీతారామరాజు(36) కలసి ద్విచక్ర వాహనంపై రావులపాలెం వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామాలు చేరుకునే తరుణంలో జొన్నాడ ఏటి గట్టు సమీపానికి వస్తున్నారు. ఈ క్రమంలో వారికి ముందుగా వెళుతున్న మత్స్యకారుల బొలెరో వాహనం కపిలేశ్వరపురం వైపునకు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది. ఈ సమయంలో వీరి ద్విచక్ర వాహనదారు వెనుక నుంచి బొలెరో వాహనాన్ని ఢీకొంది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుళ్లలో విషాద ఛాయలు

జొన్నాడ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్ల కు చెందిన వేగిరాజు సీతారామరాజు (36) మృత్యువాత పడ్డాడు.. ఇతనికి భార్య కోటేశ్వరి, కొడుకు షణ్ముఖ దైవతేజ (12), కుమార్తె సాయిశ్రీ తేజస్విని (8) ఉన్నారు..అలాగే ఇతని తండ్రి సోలోమనరాజు దయాలిసిస్ పేషెంట్. స్థానికంగా వెల్డింగ్ చేసుకుంటూ జీవించే రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దుళ్లలో ఇంటి వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు సీతారామరాజు కుటుంబాన్ని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ సర్పంచి గుర్రపు కొండయ్య మాష్టారు, టిడిపి నాయకులు ముమ్మిడి దేవి నాగేశ్వరరావు పరామర్శించారు.

నాలుగు యూనిట్ల ఇసుక సీజ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన నాలుగు యూనిట్ల ఇసుకను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వివరాలు ఇవి.. మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి నది వశిష్ఠ పాయ వెంబడి బ్యారేజ్ చెంతన ఇసుక తవ్వకాలు నిర్వహించి నిల్వ ఉంచిన నాలుగు యూనిట్ల ఇసుకను తహశీల్దార్ టి.ఆర్.రాజేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ భవాని మంగళవారం ఇసుకను సీజ్ చేశారు. ఇసుకను పంచాయతీ కార్యదర్శికి అప్పగించినట్లు తెలిపారు.

దాడి కేసులో ఐదుగురికి జైలు

ప్రజాశక్తి - రాజోలు

మహిళలను అగౌరవపరిచి, గాయపరచిన కేసులో రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు ఐదుగురు వ్యక్తులకు ఒక ఏడాది జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారని రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ తెలిపారు. 2019 మార్చి 6 వ తేదీన రాజోలు మండలం, సోంపల్లి గ్రామానికి చెందిన మల్లాడి దుర్గా కళ్యాణి అదే గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వర రావు, చింతా దుర్గ, చింతా కిరణ్, పొన్నమండ విజయలక్ష్మి, పొన్నమండ శ్రీనివాస్ ప్రయివేట్ విషయంలో గొడవ జరిగింది. ఈ విషయంపై తనను అగౌరవ పరచడం తోపాటు, తనను కొట్టారని రాజోలు పోలీస్ స్టేషన్ దుర్గా కళ్యాణి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ఐదుగురు నిందితులకు జూనియర్ సివిల్ హిమబిందు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈకేసులో బాధితురాలు తరుపున ఎపిపి ఎస్.ఆనంద్ వాదించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక కెన్ఎపిల్ పోర్టు 1ఎ బెర్త్ దగ్గర సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన మృతదేహం సముద్రంలో కొట్టుకొచ్చిందని స్థానిక పోర్టు పోలీస్స్టేషన్ పోలీసులు తెలిపారు. ఈ శవం సుమారు ఐదారు రోజుల క్రితం సముద్రంలో పడి ఉండొచ్చని, కొన్ని శరీర భాగాలు చేపలు తినేసినట్లు ఉన్నదన్నారు. ఈ శవం యొక్క ముఖభాగాన్ని గుర్తు పట్టని విధంగా చేపలు తినేసినట్లు చెప్పారు. ఈ మధ్య కాలంలో ఎక్కడైనా వినాయక నిమజ్జనంతోపాటు పడి పోయిన వారైనా ఉండవచ్చునని, ఎవరైనా ప్రమాదవశాత్తు బోటు పైనుంచి పడిపోయిన ఉండొచ్చన్నారు. ఎవరైనా ఈ డెడ్ బాడీని గుర్తిస్తే పోర్టు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440796543కి, లేదా పోలీస్ స్టేషన్ నెంబర్ 08842378711కి సమాచార ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - [illegible]

మండలంలోని చిక్కాల గ్రామానికి చెందిన సంసాని గంగారావు గత నెల రెండు రోజుల క్రితం ఉరేసుకొని చనిపోవటానికి కారణమైన అదే గ్రామానికి చెందిన పెదపాటి పండును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని అన్నంపల్లి టోల్ గేట్ ప్రాంతంలో మరమ్మతులు చేస్తుండగా 11 కెవి వైర్లు నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ప్రయివేటు ఎలక్ట్రీషియన్ మోర్త సాయికుమార్(42) విద్యుత్ షాక్ గురయ్యాడు. అతడిని ముమ్మిడివరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగానే సాయికుమార్ మృతికి కారణమని కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. ఐ.పోలవరం మండలం పల్లపులంక అంబటివారిపేటకు చెందిన మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - కరప

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. మంగళవారం కరప పెట్రోల్ బంక్ వద్ద మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఆధార్ కార్డులో ఉన్న సమాచారం మేరకు మృతుడు బీహార్కు చెందిన మదన్ కుమార్ సాహ్ని (35)గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధికోత్పత్తి సాధ్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ మూలపొలం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్కుమార్ పాల్గొని మాట్లాడారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెలకువలు ద్వారా పంటలో అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ సాగునీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడం రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇంజరం వంతెన తూరలు వల్ల, శివారు భూములకు నీటి ఎద్దడి వస్తుందని అన్నారు. సమస్యను ఇరిగేషన్ ఎస్ఇ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వ్యవసాయ శాఖ జెడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కె.బాబురావు, జడ్పిటిసి సాగర్, మండల ఎఒ ప్రశాంతి, దూళిపూడి బాబీ, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని బూరుగుపూడిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బివిఎస్.హరి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.దైవకుమార్, జనసేన ఇన్ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, నాయకులు తోట గాంధీ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని సిరిపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ, బెల్లంపంట, అరటి ఎగుమతులు, అరటి నారతో మార్కెటింగ్ ఇతర ఉత్పత్తులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి, సర్పంచ్ పీతల నూకరాజు, టిడిపి మండల ఇన్ఛార్జ్ సూతి బూరయ్య, జిల్లా వనరుల కేంద్రం ఎఒ సంజీవ్కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ డి శ్రీవల్లి, మార్కెటింగ్ కార్యదర్శి విజయకుమార్, సూపరింటెండెంట్ శ్రీరామ్ బాబు, రైతులు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్బాబు, డాక్టర్ వై.రోనిక, డాక్టర్ సీతారామశర్మ, హార్టికల్చర్ ఆఫీసర్ పి.లావణ్య, ఫిషరీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని గోరింట గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం సర్పంచ్ పచ్చిపాల మేరికుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఒ సంజాయ్కుమార్, పశు వైద్యాధికారి డాక్టర్ ముస్తాబి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎన్వివి.ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సాహితి, శ్రీవాణి, ఆఖిల్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి విజయ్ కుమార్

పలు గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - కిర్లంపూడి, సామర్లకోట, కరప

కిర్లంపూడి మండలంలో బూరుగుపూడిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, చదరం చంటిబాబు సర్పంచ్ ఆశపు రామలక్ష్మి, ఉప సర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి పాటంశెట్టి సత్యవతి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సామర్లకోట మండలంలోని పి.వేమవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకట రమణ, సర్పంచ్ నూకరత్నం, తహశీల్దార్ డి.చంద్ర శేఖర రెడ్డి, ఎంపిడిఒ డి.శ్రీలలిత, వ్యవసాయ శాఖ ఎఒ ఐ.సత్య, ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు. కరపలోని చిరంజీవి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, కూటమి నాయకులు పిల్లి సత్యనారాయణ మూర్తి, కటకంశెట్టి బాబీ, నురుకుర్తి వేంకటేశ్వర రావు, పెంకె శ్రీనివాస్ బాబా, బండారు మురళీ, బోగిరెడ్డి కొండబాబు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల

11 మంది బచ్చు ఫౌండేషన్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

స్కూల్ గేమ్స్ ఎంపికలో నియోజకవర్గ స్థాయిలో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 11 మంది జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. అండర్-14 విభాగంలో ఖోఖో క్రీడలో ఎం.శివ, గౌతం, కామేష్, ఖోఖో అండర్-17 విభాగంలో జి రాకేష్ ఎంపికయ్యారన్నారు. అండర్-14 కబాడీలో డి.రంజిత్, అండర్-17 విభాగంలో కె.అభిరామ్, కార్తీక్రెడ్డి, సాయిసత్య, మనోజ్, సూర్య ఎంపికయ్యారని తెలిపారు. అథ్లెటిక్ అండర్-14లో 400 మీటర్ల పరుగు పోటీల్లో ఆంజినేయరెడ్డి తృతీయ స్థానం పొందారన్నారు.

నియోజకవర్గ క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజు సూరిబాబురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం ఉత్సాహంగా పాల్గొని రాణించాలన్నారు. విద్యార్థి దశ నుండే క్రీడలు పై ఆసక్తి పెంపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం క్రీడ ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, పిడిలు బంగారాజు, సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - కాకినాడ రోడ్డులో ఇండియన్ ఆయిల్ బంకులో విజిలెన్స్, సివిల్ సప్లయి, ఫైర్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులతోపాటు, ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం ఉప్పలంక జంక్షన్ వద్ద యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ పట్టుకున్న కేసులో ఈ బంకు యజమాని ముద్దాయి అని ఆరోపణ రావడంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ డిఎస్పి ఎస్.తాతారావు తెలిపారు. ఈ క్రమంలోనే కాకినాడలో ఇదే యజమానికి చెందిన మరో బంకులో కూడా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.ఈ తనిఖీల్లో ఎటువంటి తేడాలు కనిపించలేదని, ఎటువంటి కేసులు నమోదు చేయాలేదని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎలుకల బారి నుంచి పంటను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఎలుకల బారి నుంచి పంటను కాపాడేందుకు దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి సూచించారు. మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ రైతులకు ఎలుకల మందును పంపిణీ చేసినట్లు తెలిపారు. యర్రంపాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రంగు, రుచి, వాసన లేని బ్రోమోడయోలిన్ మందును నూకలు, నూనె తగు పాళ్లలో కలిపి పొట్లాలుగా చుట్టి సాయంత్రం సమయంలో ఎలుక బొరియలు వద్ద ఉంచడం ద్వారా ఎలుకలు నిర్మూలన సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నారి, విఆర్ఒ బాబా, విఎఎ సుమిత్ర, టిడిపి గ్రామ అధ్యక్షుడు ముత్యాల భాస్కరరావుపాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

ప్రజాశక్తి - పెద్దాపురం

2025-26వ ఏడాది పెద్దాపురం జవహార్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు స్వీకరణ గడువును వచ్చే నెల అక్టోబర్ 7వ తేదీ వరకూ పొడిగించినట్లు విద్యాలయ ఇన్ఛార్జ్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ప్రస్తుతం కాకినాడ. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలోని 43 మండలాల నుంచి ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల్లో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు అర్హులన్నారు. అక్టోబర్ 7వ తేదీలోగా ఆన్లైన్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 జనవరి 18న మూడు జిల్లాల్లోని సుమారు 45 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. మూడు జిల్లాల పరిధిలోని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాట్ జిఒవిడాటిన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రుణాల కల్పనకు ప్రాధాన్యత: కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో వ్యవసాయం, వాటి అనుబంధ స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకై రుణాల కల్పనలో ప్రాధాన్యద ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళికగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి వివిధ రంగాలకు కలిపి రూ.14,259 కోట్లు లక్ష్యంగా నిర్దేశించిందిగా జూన్ 30 నాటికి రూ.5,965 కోట్ల మేర రుణాల కల్పనతో సుమారుగా 41.80 శాతం మేర లక్ష్య సాధన జరిగిందన్నారు. ప్రతి బ్యాంకు బ్రాంచి మేనేజర్లు తమకు నిర్దేశించిన వార్షిక రుణ లక్ష్యాలు చేరుకోవాలన్నారు. తొలుతగా గత సమావేశంలో మినిట్స్ పై తీసుకున్న చర్యలను సమీక్షించారు. అదేవిధంగా పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమల్లో భాగస్వాములు కావాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ సూచించారు. అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు స్వయం ఉపాధి కల్పన పథకాలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ బ్యాంకుల ప్రతి నిధులకు సూచించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు-బ్యాంకు లింకేజీ, ఆర్థిక సాక్షరత కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అంశాల్లో పురోగతి తదితరాలపై చర్చించారు. తొలుత ఎల్డీఎం వర్మ జీవనోపాదుల పెంపు, గ్రామీణ శిక్షణ కార్యక్రమాలు, వార్షిక రుణ ప్రణాళికలో సాధించిన పురోగతి, ప్రస్తుతం నడుస్తున్న యూనిట్లులో ఉత్పాదకను పెంపుదలకే చేపట్టిన చర్యలు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం, మత్స్య, పశుసంవర్ధక శాఖల్లో ప్రభుత్వ రుణంతో ముడి పడి ఉన్న పథకాల అమలు తీరు, స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పాదకత యూనిట్లు మంజూరు, టిడ్కో గృహ నిర్మాణాల రుణాల కల్పన రీపేమెంట్, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి ముద్ర యోజన నాబార్డ్ ద్వారా యూనిట్లు స్థాపన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన చిన్న తరహా అభివృద్ధి బ్యాంకు ద్వారా యూనిట్లు స్థాపన, ఇత్యాది అంశాలలో పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో మొత్తం 294 బ్యాంకు బ్రాంచిలు వున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనను వివరించారు. చిన్న, మధ్య తరహా సంస్థలకు సంబంధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని తెలియజేశారు. బ్యాంకులు, బ్రాంచీల వారీగా ప్రగతి ప్రజా సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంలో బ్యాంకులది కీలకపాత్రని, ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా బ్యాంకులు, బ్రాంచీల వారీగా లక్ష్యాల సాధనకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టిన పథకాల ద్వారా పూర్తి స్థాయిలో సమాజానికి ప్రయోజనాలు లభించేలా బ్యాంకులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరిం చాలని, అర్హులైన వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్థిక సాక్షరత కార్యక్రమాలను క్రియాశీలకంగా నిర్వహించి సమాజంలో ఆర్థిక అక్షరాస్యతపై పూర్తిగా అవగాహనను పెంపొందించాలన్నారు. బ్యాంకుల సేవలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాల ను పెంచేందుకు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు, ఎగు మతుల కార్యక్రమాల ద్వారా సమాజ ఆర్థిక అభివద్ధిలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, సమష్టి భాగస్వామ్యంతో ప్రజల ఆర్థిక సాధికారతకు కషి చేయాలని కోరారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తు లను త్వరతగతిన పరిష్కరించి అర్హులకు మేలు జరిగేలా చూడాలన్నారు. సూర్య ఘర్ పథకం ను సముద్ర తీర లంక ప్రాంత గ్రామాలలో ఎక్కువగా యూనిట్లు గ్రౌండ్ చేయాలని ఇన్వర్టర్ సౌకర్యం కూడా కల్పనకు యోచన చేయాలని సూచించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎజిఎం హనుమకుమారి యుబిఐ రీజినల్ మేనేజర్ సాయి మనోహర్, డిఆర్డిఎ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, ప్రియం వదా, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు, నాబార్డ్ ఎజిఎం స్వామి నాయుడు, జిఎం డిఐసి పికె.ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

జాతీయ రహదారి 216 అభివృద్ధికి చర్యలు : జెసి

ప్రజాశక్తి-అమలాపురం

జాతీయ రహదారి 216 అభివృద్ధికి సంబంధించి మూడేళ్ల పెండింగ్లో ఉన్న అభ్యంతరాలపై ప్రత్యేక దష్టి సారించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి రెవెన్యూ అధికారులు, జాతీయ రహదారుల ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ రహదారులు, రెవెన్యూ, తహశీల్దార్లు , సర్వేలతో సమావేశం నిర్వహించి పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పరిష్కార దిశగా మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అంశాలపై చట్టపరమైన చర్యల ద్వారా ముందుకు వెళ్లి రహదారి నిర్మాణ పనులు పునరుద్ధరణకు తోడ్పాటు అందించాలని ఆదేశించారు. జాతీయ రహదారి నిర్మాణంలో అడ్డంకిగా ఉన్న నిర్మాణాలకు నిబంధనల మేరకు ఆర్అండ్బి విభాగం ద్వారా గణించి, చెల్లిస్తూ ముందుకు సాగాలన్నారు. మామిడి కుదురు, రాజోలు మండలాల్లో ఈ యొక్క పెండింగ్ అభ్యంతరాలు ఎక్కువగా ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. సున్నితమైన అంశాలు క్లెయిమ్స్, అభ్యంతరాలపై విశ్లేషించి తగు పరిష్కార మార్గాలు చూపుతూ పూర్తిస్థాయిలో పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రహదారులు భవనాలు శాఖ 216 జాతీయ రహదారి పిడి శ్రీనివాసరావు, ఏ ఈ వెంకటరమణ, ఆర్అండ్బి ఎస్ఇ బి.రాము, తహశీల్దార్లు బి మత్యుంజయరావు, సునీల్ కుమార్, ప్రసాద్, సర్వేయర్లు తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై పట్టు సాధించాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ సూచించారు. మంగళవారం కపిలేశ్వరపురం మండలం మాచర జెడ్పిఉన్నత పాఠశాలను సందర్శించిన శివప్రసాద్ అంతరిక్ష విషయాలు, ప్రయోగాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన జరిగిన అవగాహనా కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ భారత అంతరిక్ష సంస్థ చేపట్టిన, చేపడుతున్న, చేపట్టిన ప్రయోగాలు గురించి ఉపగ్రహ నమూనాల సహితంగా వివరించారు. విద్యార్థులు అంతరిక్ష అంశాల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. అలాగే అబ్దుల్ కలాం వంటి మహనీయులను విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని హితవుపలికారు. అనంతరం శివప్రసాద్ దంపతులను ఉపాధ్యాయ బృందం సత్కరిం చారు. కార్యక్రమంలో న్యాయవాది ఓంప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ శాస్త్రవేత్త శివప్రసాద్

బాధితులకు మంత్రి సుభాష్ రూ.5 వేల సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో పెద్ద వంతెన దగ్గర వెల్ల రోడ్డు లో చెట్టు కింద సిమెంట్ తూరలో నివాసం ఉంటున్న కుటుంబం చూసి చలించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ వారికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వద్దకు వెళ్లి స్థితిగతులను చూసి వారికి టిడ్కో అపార్ట్మెంట్లో గృహాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.5 వేలు అందజేశారు. వారిని అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. తమను ఆర్థికంగా ఆదుకున్న మంత్రికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

యానాం వార్తలు

సవాల్కు మల్లాడి సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

2026 ఎన్నికల్లో తాను ఓడిపోకపోతే గుండు కొట్టించుకుని, ఊరు వదిలిపోతానని చేసిన సవాల్కు మల్లాడి కృష్ణారావు సిద్ధంగా ఉండాలని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సవాల్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న పేకాట క్లబ్ వద్ద నిర్వహించిన ధర్నాలో మల్లాడి కృష్ణారావు చేసిన సవాల్కు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఈసారి మళ్లీ ప్రజలు బుద్ధి చెప్తారని గుర్తుంచుకోవాలన్నారు. మల్లాడికి పేకాట క్లబ్బుల మాత్రమే కనిపిస్తున్నాయని, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం కన్పించడం లేదన్నారు. గతంలో పేకాట క్లబ్లను మూయించాలని ప్రజల పక్షాన పోరాటం చేసింది తానని, నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించానని, అయితే రాష్ట్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు కల్గిన మల్లాడి ఆ అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఎన్డిఎ కూటమికి మద్దతు ఇచ్చానని, అయితే నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదన్నారు. మూడేళ్ల గడిచిన కనీసం ఎంఎల్ఎకి కార్యాలయాన్ని కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలపై సీఎంతో చర్చించిన పట్టించుకోలేదని, ఆయన పక్కనే ఉండి మల్లాడి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి తను అడ్డుపడలేదని, ఆలయ కమిటీలో అవకత వకలు జరగడంతో కమిటీని మాత్రమే వ్యతిరేకించినట్లు తెలిపారు. రీజెన్సీ యాజమాన్యం మల్లాడి కాళ్ళ దగ్గరకు వస్తేనే సహకరిస్తానని చెప్పడం సరికాదన్నారు. యానాం అభివృద్ధికి ఎవరి కాళ్ల పట్టుకోవడానికైన సిద్ధంగా ఉన్నానని అన్నారు. సీఎం నీ జేబులో మనిషి అయితే పేకాట క్లబ్లను శాశ్వతంగా ఎందుకు మూయించలేదని ప్రశ్నించారు. 25 ఏళ్ల ఎంఎల్ఏగా, మంత్రిగా పనిచేసిన మల్లాడి ఆసుపత్రిలో సరియైన సౌకర్యాలు ఎందుకు కల్పించలేకపోయారని నిలదీశారు. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వేయించి వారి జీవితాలు నాశనం చేశారని దుయ్యబట్టారు. రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికైనా మల్లాడి అటువంటి ఆరోపణలు మానుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. త్వరలో కార్యకర్తల సమావే శంలో మల్లాడి చేసిన తప్పులను బహిర్గతం చేస్తానని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

సమతం కృష్ణంనాయుడు జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో సమతం కృష్ణం నాయుడు జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఇన్ఛార్జ్ ఆర్ఎఒ టి.రవిశంకర్, సీఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో కెఎల్వి.ప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కాయగూరల విత్తనాలు మిని కిట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనేక సమస్యలు ఉన్నాయని, కానీ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పుదుచ్చేరిలో ఉన్న రైతులకు సమానంగా యానం రైతులకు పథకాలు అందడం లేదన్నారు. సబ్సిడీపై ట్రాక్టర్లు కొనుగోలుకు సుమారు రెండు కోట్ల రూపాయలు నిధులు వెనక్కి తీసుకోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అవసరమైతే ప్రభుత్వంతో పోరాడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణ్యన్, అగ్రికల్చర్ ఆఫీసర్ సిహెచ్.జోగిరాజు, ఫీల్డ్ మాన్ ఐకె.ఖాన్, డిఎం.విజయ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎఇగా అశోక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల విద్యుత్ శాఖ ఎఇగా టి.అశోక్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలను స్వీకరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో విద్యుత్కు అంతరాయం కలగకుండా సమస్యల పరిష్కారానికి కషి చేస్తా నని అన్నారు. ఇప్పటివరకు పనిచేసిన ఎఇ కె.బాపిరాజు బదిలీపై వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా 'కొండేటి' ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కామన ప్రభాకరరావు, సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రామచంద్రపురం, కె.గంగవరం తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వం అధికారులు బదిలీల్లో భాగంగా రామచంద్ర పురం తహశీల్దార్ ఎం వెంకటేశ్వరరావు అల్లూరి సీతారామరాజు ఏజెన్సీకి బదిలీ చేశారు. అదేవిధంగా కె.గంగవరం తహశీల్దార్ సూర్యారావును ఏజెన్సీకి బదిలీ చేశారు. వీరిద్దరూ ఇటీవల బదిలీపై వచ్చారు. వీరు స్థానంలో కొత్త తహశీల్దార్ల నియామకం జరగాల్సి ఉంది.

ట్రై సైకిల్ అందజేసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వికలాంగునికి ట్రై సైకిల్ను ఎంఎల్ఎ ఆనందరావు మంగళవారం అందజేశారు. వివరాలు ఇవి.. గొల్లవిల్లి పంచాయితీ వాడపర్రుకు చెందిన యువకుడు చుట్టుగుళ్ళ వెంకటేశ్వరరావు పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. వెంకటేశ్వరరావు పరిస్థితిని చూసిన స్థానిక నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంకటేశ్వరరావుకు ప్రభుత్వం ట్రై సైకిల్ మంజూరు చేసింది. ఈ ట్రై సైకిల్ను మంగళవారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు బాధితుడు వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, గొలకోటి సత్తి రాజు,నాగారపు అర్జునరావు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సత్య శోధక్ సమాజ్ 152 వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగామహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, వి. రామకష్ణ, ఐఎఫ్టియు నాయకులు చింతా రాజారెడ్డి, కరిపోతుల నవీన్ కుమార్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు ఎం. సాగర్, ఎల్.చందు, కె.శ్రీను, పి. ప్రవీణ్. జి. దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామంలో భారీ వర్షం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించింది. కె.గంగవరం మండలంలోని శివల గ్రామంలోనూ భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. భారీ వర్షానికి తోడు విద్యుత్ కూడా అంతరాయం ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం నుండి రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.